క్లుప్తంగా

యాప్ ద్వారానే విద్యుత్ బిల్లుల చెల్లింపు

ఏర్పేడు: సదరన్ డిస్కం పరిధిలోని విద్యుత్ వినియోగదారులు తమ బిల్లులను ఏపీఎస్పీడీసీఎల్ వెబ్‌సైట్, మొబైల్ యాప్ ద్వారానే చెల్లించాలని ఏర్పేడు ఏఈ వాసుదేవయ్య తెలిపారు. ఇకపై ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎంలతో పాటు ఇతర యూపీఐ యాప్‌ల ద్వారా బిల్లులు చెల్లించడానికి వీలుపడదన్నారు. తమ సంస్థ మొబైల్ యాప్, ఏపీఎస్పీడీసీఎల్.ఇన్ ద్వారా బిల్ డెస్క్‌కు అనుసంధానమైన గూగుల్ పే, పేటీఎం, ఫోన్ పే యాప్‌లతో పాటు, ఇతర యూపీఐ యాప్‌లను ఉపయోగించి చెల్లించాలని సూచించారు. అలాగే క్రెడిట్ కార్డు, డెబిట్ కార్డు, వాలెట్, క్యాష్ కార్డు, నెట్ బ్యాంకింగ్‌లను వాడుకోవచ్చని వెల్లడించారు.

కలెక్టర్‌కు ముక్కంటి ప్రసాదాలు


కలెక్టర్‌ను సన్మానిస్తున్న కమిషనర్ రమేష్‌బాబు

శ్రీకాళహస్తి: తిరుపతి జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ఎస్.వెంకటేశ్వర్‌ను గురువారం శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్ రమేష్‌బబు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను శాలువాతో సన్మానించి ముక్కంటి ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు, బాలచంద్ర తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం


దరఖాస్తు అందజేస్తున్న వార్డెన్ సాల్మన్‌రాజ్

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని బీసీ హాస్టల్ ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని వార్డెన్ సాల్మన్‌రాజ్ తెలిపారు. హాస్టల్ ప్రవేశానికి సంబంధించిన దరఖాస్తులను విద్యార్థుల తల్లిదండ్రులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ హాస్టల్‌లో ప్రవేశానికి ఇప్పటికే 28 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. హాస్టల్‌లో ప్రభుత్వం ఎన్నడూ లేని విధంగా మెనూ అమలు చేస్తుందని, ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్యతోపాటుగా ఉచితంగా పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్, బెల్ట్, నోట్‌బుక్స్, డిక్షనరీ, బూట్లు, సాక్సులు, అందించడంతో పాటు మధ్యాహ్నం రుచికరమైన పౌష్టికాహారం అందిస్తున్నట్లు తెలిపారు.

భక్తులకు అన్నదానం



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణంలోని భరద్వాజ తీర్థం వద్దనున్న నరసింహస్వామి సన్నిధి వద్ద గురువారం శివగణం భక్త బృందం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. అన్నపూర్ణ మాత ఆరాధనోత్సవం సందర్భంగా నరసింహస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అదే విధంగా వినాయకుడు, నాగదేవతలకు విశేష పూజలు నిర్వహించారు. శ్రీకాళహస్తి క్షేత్ర స్థల పురాణం గురించి డాక్టర్ నగరి చాముండేశ్వరరావు వివరించారు. కార్యక్రమంలో సిద్దులయ్య, రామలింగస్వామి, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

అన్నదాన సత్రంలో తనిఖీలు


అన్నదానంలో సాంబారును పరిశీలిస్తున్న బొజ్జల బృందమ్మ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ అన్నదాన సత్రంలో ఎమ్మెల్యే తల్లి బొజ్జల బృందమ్మ, సతీమణి రిషితారెడ్డి గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. భక్తులకు వడ్డించడానికి సిద్ధంగా ఉంచిన సాంబారు రుచి చూసి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం సీసీ కెమెరా పర్యవేక్షణ గదిని పరిశీలించారు. తర్వాత అన్నదాన స్టోర్‌లోని సరుకుల వివరాలపై ఆరాతీశారు. వారి వెంట పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

స్విమ్స్ దంత విభాగంలో ఎక్స్‌రే సేవలు

తిరుపతి తుడా: స్విమ్స్ దంత వైద్య విభాగంలో ఎక్స్‌రే సేవలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆధునిక ఐఓపీఏ ఎక్స్ సర్వేతోపాటు ఆర్వీజీ సేవలు అందుబాటులోకి తెచ్చామని ఆయన తెలిపారు. అత్యంత సూక్ష్మ సమస్యలను గుర్తించేందుకు ఈ వైద్య పరికరాలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. ఈ ఆధునిక వైద్య సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అల్లూరి సేవలు చిరస్మరణీయం



శ్రీకాళహస్తి : అల్లూరి సీతారామరాజు సేవలను వివరిస్తున్న అధ్యాపకులు, ఏర్పేడు: అల్లూరి సీతారామరాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

శ్రీకాళహస్తి: స్వాతంత్ర సమరయోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు సేవలు చిరస్మరణీయమని అధ్యాపకులు తెలిపారు. పట్టణంలోని మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం అల్లూరి సీతారామరాజు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన త్యాగాల గురించి విద్యార్థులకు వివరించారు. అధ్యాపకులు పద్మమాలిని పాల్గొన్నారు.

ఏర్పేడులో..

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతిని ఘనంగా జరుపుకున్నారు. అధ్యాపకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ అమరేశ్వర్‌రెడ్డి, అధ్యాపకులు శ్రీమన్నారాయణ, ఉమ, వెంకటసుబ్బమ్మ, నారాయణరెడ్డి, రామాంజులు, రాఘవరెడ్డి పాల్గొన్నారు.

భావితరాలకు స్ఫూర్తి అల్లూరి


సత్యవేడు: అల్లూరి సీతారామరాజు చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న రెవెన్యూ సిబ్బంది

సత్యవేడు: విప్లవ వీరుడు, స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు పోరాటస్ఫూర్తిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ రవి చంద్ర అన్నారు. గురువారం రెవెన్యూ కార్యాలయంలో సీతారామరాజు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ మాట్లాడుతూ గొప్పపోరాట యోధుడు, దేశభక్తి కలిగిన గొప్ప వ్యక్తి అల్లూరి సీతారామరాజు అని గుర్తు చేశారు. దేశ ప్రజల కోసం అల్లూరి చేసిన కృషి ఎనలేనిదని కొనియాడారు. 1986లో అల్లూరి సీతారామరాజు స్మారక స్టాంపును ఇండాయ పోస్టు విడుదల చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సురేష్ , జూనియర్ అసిసిస్టెంట్లు కళావతి, శ్రీనివాసరాజు, మాధురి, వీఆర్వోలు ఇళయరాజ, పి.మోహన్‌రాజు, టి.సురేష్, సర్వేయర్ చెంచుబాబు పాల్గొన్నారు.

సచివాలయాల ఆకస్మిక తనిఖీ


సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ బాబు

నాగలాపురం: మండలంలోని టీపీ కోట, కడివేడు సచివాలయాలను నాగలాపురం ఎంపీడీఓ పీఎంకే బాబు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది విధినిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేదిలేదన్నారు. ముందుగా హాజరు పట్టిక, మూమెంట్ రిజిస్టర్లను పరిశీలించారు. ప్రతి రోజు సిబ్బంది ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తప్పనిసరిగా సచివాలయంలో ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శైలేంద్ర కుమార్ పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా గురుదక్షిణామూర్తికి పూజలు


ప్రత్యేక అలంకరణలో గురుదక్షిణామూర్తి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన గురుదక్షిణామూర్తికి గురువారం శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా స్వామికి వివిధ అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు.

భూసార పరీక్షలతో ఎరువుల ఆదా


మాట్లాడుతున్న ఏడీఏ భాస్కరయ్య

ఏర్పేడు: భూసార పరీక్షా ఫలితాల ఆధారంగా పంటలకు ఎరువులు వాడితే ఖర్చు బాగా తగ్గించవచ్చని వ్యవసాయ శాఖ వనరుల కేంద్రం జిల్లా ఏడీఏ భాస్కరయ్య తెలిపారు. ఆయన గురువారం ఎండీపుత్తూరులో సర్పంచ్ మోహనప్రియ ఆధ్వర్యంలో భూసార పరీక్షలపై రైతులకు శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ భూసార పరీక్షల ద్వారా నేల ఆరోగ్యం, పోషకాల అందుబాటు, లోపాల గురించి తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. ఫలితాలను బట్టి లోపాలు సరిదిద్దడానికి చర్యలు తీసుకుంటే అధిక దిగుబడులు వస్తాయని సూచించారు. చౌడు భూములకు జింకు, నానో డీఏపీ ఎరువులు పంటపై స్ప్రే చేస్తే మంచి ఫలితం ఉంటుందన్నారు. వరి సాగులో చేపట్టాల్సిన సాగు పద్ధతులు, చీడల నివారణ, నానో ఎరువుల వాడకం, సూక్ష్మ పోషకాలు, వ్యవసాయ శాఖ అందిస్తున్న సేవలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇఫ్కో క్షేత్ర అధికారి మణిచంద్ర, వనరుల కేంద్రం జిల్లా ఏవో వేణుగోపాలరావు, ఏవో షణ్ముగం, వ్యవసాయ సహాయకురాలు భారతి పాల్గొన్నారు.

సినీఫక్కీలో చైన్ స్నాచింగ్

ఏర్పేడు: మండలంలోని ఐఐటీ సమీపంలో గురువారం సినీఫక్కీలో చైన్ స్నాచింగ్ జరిగినట్లు ఏర్పేడు సీఐ శ్రీరామశ్రీనివాసులు తెలిపారు. వివరాలు.. మండలంలోని ఆమందూరు బీసీ కాలనీకి చెందిన సావిత్రమ్మ(57) తన మనువరాలు ఐఐటీలోని కేంద్రీయ విద్యాలయంలో చదువుకుంటోంది. ఈ క్రమంలో మనుమరాలిని ఇంటికి తీసుకుని రావడానికి నడుచుకుని వెళ్తుంగా ఐఐటీకి సమీపంలో బైక్‌లో వచ్చిన ఇద్దరు యువకులు సావిత్రమ్మ మెడలోని బంగారు చైన్ లాక్కుని వెళ్లారు. చోరీకి గురైన బంగారు చైన్ సుమారు 5 సవర్లు ఉంటుందని బాధితురాలు తెలిపింది. ఆమె ఫిర్యాదు మేరకు విచారణ చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

కొత్త చట్టాలను వ్యతిరేకిస్తూ న్యాయవాదుల నిరసన


నాయుడుపేట కోర్టు వద్ద నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

నాయుడుపేట టౌన్ : కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశ పెట్టిన చట్టాలను వ్యతిరేకిస్తూ న్యాయవాదులు గురువారం జూనియర్ సివిల్ జడ్జి కోర్టు వద్ద విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పసల గంగాప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశ పెట్టిన చట్టాలు పౌర హక్కులకు భంగం కలిగించేలా ఉన్నాయని తెలిపారు. వాటిని మార్పు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు వీరాస్వామి, షేక్ రఫీ, దశయ్య మొదలియార్, ఆశా చెంచుకృష్ణయ్య, మొరా ఈశ్వరయ్య పాల్గొన్నారు.

అర్హులైన కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు

దక్కిలి: అర్హులైన కౌలు రైతులకు సీసీఆర్‌సీ (కౌలు రైతు సర్టిఫికెట్లు) మంజూరు చేస్తామని తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. ఆయన గురువారం వీఆర్వోలు, వ్యవసాయశాఖ వీఏవోలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో కౌలు కింద పంటలు సాగు చేస్తున్న రైతులు సీసీఆర్‌సీ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. భూ యజమాని కౌలు రైతు ఒప్పంద పత్రం అందజేస్తే ఉచితంగా కార్డులు ఇస్తామని, ఈ సర్టిఫికెట్ కాల పరిమితి 11 నెలలు ఉంటుందని తెలిపారు. అతివృష్టి, అనావృష్టి వల్ల పంటలు దెబ్బతింటే పరిహారాన్ని కౌలు రైతులకు అందజేస్తామన్నారు. భూ యజమానులు ఎలాంటి అపోహలకు గురికావాల్సిన అవసరం లేదని, అన్ని హక్కులు భూ యజమానికే ఉంటాయన్నారు. కౌలు కాల పరిమితి వరకు మాత్రమే కౌలు రైతులకు హక్కు ఉంటుందన్నారు. పాసు పుస్తకాలు, వెబ్‌ల్యాండ్‌లో పేర్లు మార్చడం జరగవన్నారు. ఈ విషయాలను ఆయా గ్రామాల వీఆర్వోలు, వ్యవసాయశాఖ సిబ్బంది గ్రామసభ ద్వారా అవగాహన కల్పించాలని ఆదేశించారు.

వంగవీటి మోహనరంగాకు ఘన నివాళి



అన్నదానం చేస్తున్న అంజూరు తారక శ్రీనివాసులు, వంగవీటికి నివాళులర్పిస్తున్న నేతలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణంలో గురువారం వంగవీటి మోహనరంగా జయంతిని ఆయన అభిమానులు జరుపుకున్నారు. ప్రభుత్వాస్పత్రి సమీపంలో గల వంగవీటి మోహనరంగా విగ్రహానికి శ్రీకృష్ణదేవరాయల బలిజ సంక్షేమ సంఘం నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదలకు అన్నదానం చేశారు. శ్రీకాళహస్తీశ్వరాలయ పాలక మండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ వంగవీటి మోహనరంగా ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. శ్రీకాళహస్తిలో ఆయన విగ్రహం ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో గాజుల సత్యనారాయణ, ఉప్పు కృష్ణయ్య, స్వర్ణమూర్తి, గరికపాటి చంద్రశేఖర్, అంజూరు వెంకటేష్, పగడాల రాజు, రమేష్, రవి, నారాయణ, కంఠా ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

వాతావరణ మార్పులతో పంటలకు తెగుళ్లు


ప్రకృతి సాగు విధానాల గురించి వివరిస్తున్న భాస్కరయ్య

నారాయణవనం: ప్రస్తుతం వాతావరణ మార్పుల కారణంగా పంటలకు తెగుళ్లు అధికమవుతున్నాయని వ్యవసాయ శాఖ జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ భాస్కరయ్య పేర్కొన్నారు. మండలంలోని కొండలచెరువులో ×ఆత్మా సహకారంతో గురువారం రైతులకు శిక్షణ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న భాస్కరయ్య మాట్లాడుతూ వాతావరణ మార్పులు పంటలపై ప్రభావం చూపుతాయన్నారు. అకాల వర్షాలు, అనావృష్టి , కరువు పరిస్థితులతో కొత్త చీడలు పంటలను ఆశిస్తాయని అన్నారు. నవంబర్, డిసెంబర్ మాసాల్లో అధిక మంచుతో ఈ ఏడాది మామిడి పూతలు ఆలస్యమై దిగుబడి తగ్గిందన్నారు. ప్రస్తుతం వర్షాలకు ఉద్యాన పంటల్లో రసం పీల్చే పురుగులు, వైరస్ తెగుళ్లు సోకుతాయన్నారు. పంటల్లో సమస్యలకు వాతావరణ మార్పులే కారణమని తెలిపారు. అంతర పంటల సాగు, అధికంగా సేంద్రియ ఎరువుల వాడకం, పంటల సాగులో వైవిధ్యం పెంచడం ద్వారా తెగుళ్ల సమస్యలను చాలావరకు తగ్గించవచ్చన్నారు. కొండల చెరువు గ్రామంలో అధికంగా సాగు అవుతున్న మల్లె తోటలలో చీడల నివారణ గురించి భాస్కరయ్య వివరించారు. ప్రకృతి సాగుపై రైతులు దృష్టిని సారించాలని వ్యవసాయశాఖ ఏడీ రమేష్ అన్నారు. మారుతున్న వాతావరణ పరిస్థితులపై అవగాహన పెంచుకుని ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అవలంభించడం ద్వారా పెట్టుబడి వ్యయాన్ని తగ్గించుకుని, నాణ్యమైన పంట దిగుబడిని సాధించవచ్చన్నారు. ముఖ్యంగా ప్రకృతి సాగులో ఉద్యాన పంటల్లో మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు. వరి సాగులో చేపట్టాల్సిన మేలైన సాగు పద్ధతులు, ఎరువుల వినియోగం, కలుపు, చీడల నివారణ చర్యల గురించి ఏఓ వేణుగోపాల్ రావు వివరించారు. సదస్సులో వ్యవసాయ సహాయకులు విష్ణుప్రియ, మురళి యాదవ్, సుభాషిణి, మోహన్, రమ్య, దివ్య, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది భూపతి, అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

మంచినీళ్లివ్వండి మహాప్రభో...!


తాగునీటి సమస్యపై సర్పంచ్ నగేషంను నిలదీస్తున్న వామపక్షాలు

- తాగునీటి ఎద్దడిపై రేణిగుంట గ్రామ సభలో రభస



రేణిగుంట: రేణిగుంట పంచాయతీలో పది రోజులుగా నీటి ఎద్దడి తాండవిస్తున్నా పంచాయతీ పాలకులు పట్టించుకోకపోవడంపై ప్రజలు గ్రామసభలో ఆవేదన వ్యక్తం చేశారు. రేణిగుంట గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో గురువారం సర్పంచ్ నగేషం అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. పంచాయతీలో సమస్యలు, అభివృద్ధి పనులపై చర్చలు జరిగాయి. సీపీఎం ఎంపీటీసీ రాజేశ్వరి, నాయకులు, కాంగ్రెస్ నాయకులు, పట్టణ ప్రజలు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకుని తాగునీటి సమస్యపై నిలదీశారు. పది రోజులుగా నీరు వదలకపోతే ఎలా బతకాలని ప్రశ్నించారు. సమస్యపై స్పష్టత వచ్చే వరకు సభను జరగనివ్వబోమని సీపీఎం నాయకులు బైఠాయించారు. తెలుగు గంగ నీరు సరఫరా కాకపోవడంతో తాగునీటి సమస్య ఏర్పడిందని, ప్రత్యామ్నాయంగా వార్డుల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నప్పటికీ కొరత ఉందని, త్వరలోనే పరిష్కరిస్తామని సర్పంచ్ హామీ ఇచ్చారు. అనంతరం గ్రామంలో జరిగిన అభివృద్ధి పనులు, తీర్మానాల గురించి చర్చ జరిగింది. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుబ్రమణ్యంరెడ్డి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం


విద్యాసంస్థలను బంద్ చేయిస్తున్న విద్యార్థి సంఘాల నేతలు

శ్రీకాళహస్తి: దేశవ్యాప్తంగా నీట్, నెట్ పరీక్షలు రద్దు చేయాలని కోరుతూ విద్యార్థి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా శ్రీకాళహస్తి పట్టణంలో పీడీఎస్‌యూ, ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘాలు చేపట్టిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. ప్రైవేటు విద్యాసంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించగా పలు ప్రభుత్వ విద్యాసంస్థలను విద్యార్థి సంఘం నాయకులు బంద్ చేయించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర కోశాధికారి జాకీర్, ఏఐఎస్ఎఫ్ ఏరియా కార్యదర్శి చందు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా నీట్, నెట్ పరీక్షలను రద్దు చేయాలని, నీట్ పరీక్షా ఫలితాల్లో జరిగిన అవకతవకలపై విచారణ జరపించాలన్నారు. అదే విధంగా ఎన్‌టీఏను రద్దు చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల విలీనాన్ని ఆపాలన్నారు. అనంతరం శ్రీకాళహస్తి జూనియర్ కళాశాల నుంచి ప్రభుత్వాస్పత్రి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిజ్వాన్, షకీల్ పాల్గొన్నారు.

కార్మికుల పిల్లల చదువుకు ఫీజులు చెల్లింపు


కార్మికుల వద్ద విద్యార్థుల ఫీజు బిల్లులు అందజేస్తున్న రాక్వర్త్ పరిశ్రమ ఎండీ శైలేష్ కుమార్

సత్యవేడు: కంపెనీలో పనిచేస్తున్న కార్మికుల భద్రతకు పెద్దపీట వేస్తున్న శ్రీసిటీలోని ×రాక్వర్త్ పరిశ్రమ×, కార్మికుల పిల్లల చదువులకు భరోసా కల్పిస్తూ 12 మంది విద్యార్థులకు రూ. 9లక్షలు ఫీజు చెల్లించింది. పరిశ్రమ మేనేజింగ్ డైరెక్టర్ శైలేష్ కుమార్ తన తల్లి జ్ఞాపకార్థం మీనాదేవి మెమోరియల్ ట్రస్టు పేరిట గత మూడేళ్లుగా ప్రైవేట్, కార్పొరేట్ సంస్థల్లో చదువుతున్న కార్మికుల పిల్లలకు సంపూర్ణ సహకారం అందిస్తోంది. పరిశ్రమలో దిగువస్థాయి ఉద్యోగులు, ఆర్థిక స్థితి ఆధారంగా ఎంపిక చేసిన వారి పిల్లలకు చదువుకు భరోసా కల్పిస్తున్నారు. రెండు రోజుల క్రితం పరిశ్రమ ఎండీ విద్యార్థుల ఫీజులు చెల్లించిన రసీదులను విద్యార్థుల తల్లి దండ్రులకు అందజేశారు. లబ్ధిదారుల్లో ఇంజినీరింగ్ విద్యార్థి సుప్రజ్ కుమార్‌కు రూ.1.85లక్షలు ఫీజు, చిన్మయ సీబీఎస్ స్కూల్‌లో చదువుతున్న దీపికకు రూ.85 వేలు, వివిధ గ్రామాలకు చెందిన విద్యార్థులకు రూ.9 లక్షల ఫీజు చెల్లించారు. కంపెనీ చొరవను శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ప్రశంసించారు. ఉద్యోగులు, వారి కుటుంబాల సంక్షేమం కోసం రాక్వర్త్ నిబద్ధత అభినందనీయమంటూ ఆయన తన ప్రకటనలో పేర్కొన్నారు. పరిశ్రమల యాజమాన్యాలు దీనిని స్ఫూర్తిగా తీసుకోవాలన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

క్రీడా మైదానం ఆక్రమణపై ఫిర్యాదు


డీటీకి ఫిర్యాదు చేస్తున్న ధనంజయులు, గ్రామస్తులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని నెలవాయి గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు సంబంధించిన క్రీడా మైదానాన్ని ఇదే గ్రామానికి చెందిన భూస్వాములు ఆక్రమించారని గురువారం పాఠశాల కమిటీ చైర్మన్ ధనంజయులు, గ్రామస్తులు డిప్యూటీ తహసీల్దార్ చంద్రబాబునాయుడుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెలవాయి గ్రామంలోని భూమి సర్వే నంబరు 71బీలో 6 ఎకరాల 43 సెంట్లు భూమి జెడ్పీ ఉన్నత పాఠశాల నిర్మాణం కోసం అదే గ్రామానికి చెందిన దాతలు సుబ్బానాయుడు, వెంకటప్ప నాయుడు, రామానాయుడు, కృష్ణమనాయుడు విరాళంగా ఇచ్చారని తెలిపారు. ఎకరా 70 సెంట్లు భూమిలో పాఠశాల భవనాలను నిర్మించి, మిగిలిన భూమి క్రీడామైదానంగా వాడుకుంటున్నారన్నారు. ఈ భూమిలోని 50 సెంట్లను అదే గ్రామానికి చెందిన పుష్పమ్మ భర్త సుందరామనాయుడు అక్రమ మార్గంలో పాసుపుస్తకం తీసుకుని, ఆన్‌లైన్‌లో ఎక్కించుకుని, భూమిని జేసీబీతో చదును చేసి, ఆక్రమించుకున్నారు. వీరితో పాటు మరికొందరు పాఠశాల భూమి ఆక్రమించుకున్నారని, రెవెన్యూ అధికారులు స్పందించి ఆక్రమణకు గురైన రూ.కోట్ల విలువ చేసే పాఠశాల భూమి స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన డీటీ చంద్రబాబునాయుడు మాట్లాడుతూ పాఠశాల భూమి ఆక్రమణ అడ్డుకుంటామని హామీ ఇచ్చారు.